గణపతి పూజకు వేళాయే..

చిత్తూరు జిల్లావ్యాప్తంగా చవితి సందడి నెలకొంది. వాడవాడలా మండపాలు వెలిశాయి. ఉత్సవ కమిటీ సభ్యులు మండపాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు పోటీపడుతున్నారు. విభిన్న ఆకృత్తుల్లో బొమ్మలను కొలువుదీర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని ఇప్పటికే పోలీస్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం జరిగే చవితి సందర్భంగా గణనాథున్ని మనసారా పూజించడానికి నగరవాసులతో పాటు పాటు పల్లెప్రజలు కూడా సిద్ధమయ్యాయి.

- చిత్తూరు జిల్లా వ్యాప్తంగా చవితి సందడి
- నేడు వాడవాడలా కొలువు దీరనున్న గణనాథుడు
- మండపాల ఏర్పాటులో నిర్వాహకులు
- అనుమతి తప్పనిసరి అంటున్న పోలీసులు
- జోరందుకున్న ప్రతిమల అమ్మకాలు
- పూలకు పెరిగిన డిమాండ్
- పూజాసామగ్రి కొనుగోలుతో చిత్తూరులో సందడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తొలిపూజలు అందుకోవడానికి గణనాథుడు సిద్ధమయ్యాడు. బుధవారం వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఉదయం గణపయ్యను కొలువుదీర్చి విశేష పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను భారీగా చేపట్టారు. వినాయకున్ని కొలువుదీర్చే పనుల్లో ఉత్సవ కమిటీ సభ్యులు బిజీగా కనిపించారు. అమ్మకాలు, కొనుగోలు జోరందుకున్నాయి. ప్రధాన కూడళ్లు జనంతో కిటకిటలాడాయి. విగ్రహం ప్రత్యేక ఆకర్షణ ఉండాలని ఆరాట పడుతున్నారు. మండపాల వద్ద లైట్ సెట్టింగ్‌తో పాటు వివిధ రకాల పూలు, బెలున్ డెకరేషన్, అరటి, మామిడి తోరణాలతో ప్రతి పందిరి చవితికి స్వాగతం పలుకుతోంది.

నగరంలో ఇలా..

చిత్తూర నగరంలోని డీఐ రోడ్డు, గిరింపేట, దొడ్డిపల్లి, కొంగారెడ్డిపల్లి, మిట్టూరు, మురకంబట్టు, సంతపేట తదితర ప్రాంతాల్లో ఏటా వినాయక చవితిని ఘనంగా నిర్వహిస్తారు. ఈసారి చవితి సంబ




అమ్మకానికి ఉంచిన గణనాథుడి ప్రతిమలు, పూజాసామగ్రి

రాలు ప్రతి వీధిలో అంబరాన్నంటేలా ఏర్పాట్లు చేశారు. మండపాల వద్ద ఏర్పాటు పనులు చూస్తూ ఉదయం నుంచి రాత్రి వరకు మంచి ముహూర్తంలో స్వామివారి తొలిపూజ చేసేలా సమయం ఖరారు చేసుకున్నారు. దీంతో ఆ సమయానికి తగ్గట్టు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. తొలిపూజకు కావాల్సిన పూజా సామగ్రి కొనుగోలులో బిజీబిజీగా కనిపించారు. మండపాల వద్ద లైట్ సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

వినాయకుడికి ఇష్టమైనవి..

వినాయక చవితి పండగ సందర్భంగా నగరంలోని బజారువీధి, చర్చివీధి, కొంగారెడ్డిపల్లి ప్రాంతాల్లో వినాయకుని ప్రతిమలతో పాటు పూజకు అవసరమైన పూలు, పండ్లు, ఇతర అవసర సామగ్రిని అమ్మకానికి తెచ్చి పెట్టారు. అరటి పిలకలు, మామిటి ఆకులు, చెరుకు గడ్డలు, జిల్లేడు పూలు, పూలు, రకరకాల కాయలు జోరుగా క్రయ విక్రయాలు జరిగాయి. చిన్న బొమ్మలు ఎక్కువగా అమ్ముడుబోయాయి. భారీ విగ్రహాలకు డిమాండ్ ఏర్పడింది.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలవ్యాప్తంగా చవితి వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. గణనాథుడి పూజకు అవసరమైన సామగ్రి, సరుకుల కొనుగోళ్లతో మండలకేంద్రం కిక్కిరిసింది. మండపాలను అలంకరించి విగ్రహాలను కొలువు దీర్చేందుకు పెద్దఎత్తున యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు సన్నాహాలు చేపట్టారు. మండలవ్యాప్తంగా 500 పైగా విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు చెబుతున్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని చాలామంది మట్టి విగ్రహాలనే పూజించనున్నారు.

ఐరాలలో..

ఐరాల: మండలవ్యాప్తంగా వినాయక చవితి పండుగ సందడి మొదలైంది. పూజాసామగ్రి కొనుగోళ్లతో జెండామాను వీధి, బజారువీధి సందడిగా నెలకొంది. మండల కేంద్రంతో పాటు వాడవాడలా విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలను అలంకరించారు. వీఎస్ అగ్రహారంలో 15 అడుగుల ఎత్తు ఉన్న వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతిమల పంపిణీ

తవణంపల్లె: వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తితో మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మండలంలోని అరగొండ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు దాత సహకారంతో అందించిన మట్టి వినాయకుడి ప్రతిమలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు విద్యాసంస్థల్లో ముందస్తు వినాయక చవితి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు.

బృందావన్‌లో..

నగరంలోని బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాలలో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆ పాఠశాల కరస్పాండెంట్ శైలజ మాట్లాడుతూ పర్యావరణ హిత గణపతులనే పూజిద్దామని పిలుపునిచ్చారు. పర్యావరణ హితం అందరి లక్ష్యం కావాలన్నారు. మట్టి వినాయకులనే అందరూ పూజించాలన్నారు.

దేవి పాఠశాలలో..

నగరంలోని గిరింపేటలో ఉన్న దేవి పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించుకున్నట్లు కరస్పాండెంట్ ఎన్‌ఆర్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. వచ్చే తరాలకు స్వచ్ఛమైన వాతావరణం ఏర్పాటు చేయాలంటే మట్టి వినాయకులనే పూజించాలన్నారు.



చవితి మండపం ఏర్పాట్లలో పిల్లలు



గొడుగు అమ్మకాలు



బొమ్మలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



పూజాసామగ్రి కొనుగోలులో ప్రజలు



బంగారుపాళెం:విక్రయానికి వినాయకుడి ప్రతిమలు



బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాలలో



దేవి పాఠశాలలో



ఐరాలలో మట్టి ప్రతిమల విక్రయాలు

క్లుప్తంగా

బంగారుపాళెం ఎస్టీఓగా ప్రసన్నరాణి



ఎస్టీఓను అభినందిస్తున్న అధికారులు

బంగారుపాళెం : సబ్‌ట్రెజరీ అధికారిగా ప్రసన్నరాణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్టీఓగా పని చేస్తున్న హరిప్రసాద్ రెండు నెలల క్రితం ఉద్యోగ విమరణ పొందారు. అప్పటి నుంచి చిత్తూరు నుంచి వచ్చిన వెంకటపతి నాయుడు ఇన్‌చార్జ్ ఎస్టీఓగా ఉన్నారు. తిరుపతి నుంచి వచ్చిన ప్రసన్నరాణి రెగ్యులర్ ఎస్టీఓగా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్టీఓను సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు కలసి అభినందించారు.

హైరోడ్డు విస్తరణలో భవనాల తొలగింపు



విస్తరణ పనులు పర్యవేక్షిస్తున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్: నగరంలోని హైరోడ్డు విస్తరణలో భాగంగా మంగళవారం అధికారులు పలు భవనాలను తొలగించారు. హైరోడ్డు శ్రీకృష్ణ ఆలయం పక్కన ఉన్న భవనం తొలగించడానికి దాని యజమానులు సుముఖత వ్యక్తం చేయడంతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తన సిబ్బందితో కలిసి కట్టడాలను యంత్రాల సాయంతో నేలమట్టం చేశారు. కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు హైరోడ్డును విస్తరించడానికి అధికారులు ప్రక్రియ ప్రారంభించగా.. కొందరు పరిహారం కోసం వేచి ఉన్నారు. మరి కొందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భవనాలు తొలగించడానికి అంగీకార పత్రాలు ఇస్తున్నారు.

వాహనం బోల్తా పడి..



పూతలపట్టు(యాదమరి) : బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారి 140 మార్గంలో అదుపు తప్పి ఓ ఐచర్ వాహనం బోల్తా పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని పాలకూరు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల ప్రాంతంలో బెంగళూరు నుంచి తిరుపతి వైపు లోడుతో వెళ్తోంది. అయితే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను వైద్యచికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె: స్మార్ట్ కొత్త రేషన్ కార్డులను బయోమెట్రిక్ వేయించి వచ్చే నెల ఒకటో తేదీ నుంచి చౌకదుకాణ డీలర్లు పంపిణీ చేయాలని తహసీల్దార్ సుధాకర్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ మండలానికి ప్రభుత్వం 15,875 స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరైనట్లు వివరించారు. మండలంలోని డీలర్లు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి బయోమెట్రిక్ వేయించి ఓటీపీ వచ్చిన తర్వాత కార్డుదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత కార్డులను పంపిణీ చేయాలని సూచించారు. వచ్చే నెల 10వ తేదీ లోపు స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంఆర్ఐ జీవన్‌సాగర్, డీలర్లు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీఓ

పూతలపట్టు(యాదమరి): ఇంటింటా చెత్త సేకరణపై డీపీఓ సుధాకరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం మండల పరిధిలోని పి.కొత్తకోట గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ చెత్త సేకరణ సిబ్బంది క్రమం తప్పకుండా ప్రతీ గృహం నుంచి చెత్తను సేకరించాలని చెప్పారు. సేకరించిన చెత్తను పొడి, తడి చెత్తలుగా విభజించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీకి అదనపు ఆదాయం తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ప్రతీఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితానికి దోహదం చేసినవాళ్లు అవుతామని చెప్పారు. పంచాయతీ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన శిక్షలు తప్పవని ఈ సందర్భంగా సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జరీనాతాజ్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అధినేతతో ఆత్మీయ కలయిక




మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్, విజయానందరెడ్డి, చక్రి, మాజీ సీఎం జగన్‌తో అను, విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ , అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కలిశారు. తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పలు అంశాలను వారు అధినేత దృష్టికి తీసుకెళ్లారు. జూలై 9న జగనన్న బంగారుపాళ్యంలో మామిడి రైతులను కలవడానికి వచ్చినప్పుడు పార్టీ కార్యకర్త చక్రితో పాటు పలువురిపై అక్రమంగా కేసు పెట్టి, జైలులో పెట్టినట్లు వెల్లడించారు. అదేవిధంగా జూలై 24న తన పుట్టినరోజు సందర్భంగా అభిమానంతో చిత్తూరు నగరపాలక కోఆప్షన్ సభ్యుడు అను కేక్ కట్ చేస్తుంటే అది గిట్టని టీడీపీ నాయకులు దాడి చేశారని గుర్తు చేశారు. అంతేగాకుండా అతని ఇంటిపై దాడి చేసి అక్రమంగా కేసు పెట్టి జైలుకు పంపారన్నారు. అక్రమ కేసులకు భయపడ వద్దని.. పార్టీ అండగా ఉంటుందని మాజీ సీఎం జగన్ వారికి ధైర్యం చెప్పినట్లు తెలిపారు. వీరితో పాటు మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, జెడ్పీటీసీ బాబునాయుడు, సర్పంచులు అమర్‌నాథరెడ్డి, త్యాగ, నాయకులు మురళీరెడ్డి, రాజేష్‌రెడ్డి, స్టాండ్లీ, ప్రసన్న, చామంతి, షరీఫ్ తదితరులు కలిశారు.

హమాలీల నిరసన



స్టోర్స్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్టోర్స్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టోర్స్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరోగ్యదాస్ మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 14 వరకు నిరసన వ్యక్తం చేయనున్నట్లు చెప్పారు. అలాగే తిరుపతిలోని సీఎండీ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఆన్‌లైన్ టెండర్లు పిలవరాదని, ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాన్ని పెంచి, ఏరియా అలవెన్సు ఇవ్వాలన్నారు. అధికారులు అనాలోచిత నిర్ణయం వల్ల మూడో వ్యక్తికి టెండర్లకు పిలవడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులు సొసైటీగా ఏర్పాటు చేసుకొని పీస్ రేటు పద్ధతిలో పని చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు టెండర్లు పిలిచి కొత్తగా కాంట్రాక్టర్ చేతిలో హమాలీల భవిష్యత్ పెట్టాలని చూస్తోందన్నారు. అనంతపురంలో ఈ విధానం కాంట్రాక్టర్‌కు ఇచ్చారని తెలిపారు. ఈ పద్ధతిని జిల్లాకు తీసుకురావాలని చూస్తే సహించేది లేదన్నారు. నిరసన కార్యక్రమంలో నాయకులు శికుమార్, ఆనంద్, రాజ్‌బాయ్, మురగ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో లాభాలు

ఐరాల: రైతులు కాలానుగుణంగా ఆధునిక పద్ధతుల్లో పంట సాగుపై అవగాహన పెంచుకుని, సాగు చేయడంతో అధిక లాభాలు పొందవచ్చని ఏఓ వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కామినాయనపల్లెలో స్థానిక రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఎప్పటికప్పుడు సాంకేతిక వ్యవసాయం గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులు, సాగు సమాచారం, సూచనలు ఇస్తామన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



గుడిపాల: రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకటాచలపతి

గుడిపాల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు డీసీసీబీ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటాచలపతి అన్నారు. బుధవారం సహకార సంఘంలో రైతులకు రుణాలపై గుడిపాల పీఏసీ చైర్మన్ ప్రతాప్‌నాయుడు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో రైతులు రుణాలు ఎలా పొందాలి ? ఎలాంటి హామీ పత్రాలు సమర్పించాలనే విషయాలపై వివరించారు. రైతులకు తక్కువ వడ్డీతో రుణాలను ఇస్తామని తెలిపారు. రైతుసేవా కేంద్రంలో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు గ్రామాల్లోని రైతులకు ఈ విషయం గురించి తెలియజేయాలన్నారు. భూములు కలిగిన రైతులకు బంగారంపై కూడా రుణాలు ఇస్తామన్నారు. అలాగే ఇంటిపై కూడా తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తామన్నారు. అనంతరం డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ రఘుకుమార్ మాట్లాడుతూ అన్ని బ్యాంకుల కన్నా మన బ్యాంకులో తక్కువ వడ్డీ రేట్లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ పట్టాభి, బ్యాంకు సూపర్‌వైజర్ ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఐరాల: పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని నాంపల్లెలో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములై సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. మట్టి వినాయకుడిని పూజించాలని, గ్రామాల్లో విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



గంబూజియా చేపపిల్లలు వదులుతున్న డీఅండ్‌హెచ్‌ఓ, కమిషనర్, ఇతర అధికారులు

చిత్తూరు అర్బన్: నీటి నిల్వల్లో దోమ లార్వాలను నియంత్రించడానికి గంబూసియా రకం చేప పిల్లలకు అధికారులు చెరువుల్లో వదిలారు. మంగళవారం చిత్తూరు నగరంలోని గంగినేని చెరువులో ఈ చేపలను వదిలిపెట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సుధారాణి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు చేప పిల్లలను నిల్వ నీటి ప్రాంతాల్లో వదిలారు. అనంతరం కొంగారెడ్డిపల్లె, దుర్గానగర్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, కట్టమంచి చెరువు, బండపల్లె, రోసీనగర్, ప్రశాంత్ నగర్ తదితర ప్రాంతాల్లోని నీటి నిల్వ ప్రాంతాల్లో దాదాపు లక్ష చేప పిల్లలను వదిలామన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎంపిక



నాగరాజు



శివారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి శివారెడ్డిని ఎంపిక చేశారు. ఈమేరకు జిల్లా నాయకులు మంగళవారం వివరాలను ప్రకటించారు. ఇటీవల ఒంగోలులో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర నాయకులు వీరిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారన్నారు. భవిష్యత్‌లో జిల్లా అభివృద్ధి కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామని నాగరాజు, శివారెడ్డి తెలిపారు. తమపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

యూఎస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



బంగారుపాళెం: ఉపాధ్యాయులకు యూఎస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళ విద్యావాణి మాస పత్రిక నడుపుతున్నందుకుగానూ యూఎస్ఏ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించింది. ఈ మేరకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా మంగళవారం హెచ్ఎం రాజ్యలక్ష్మి, విశ్రాంత హెచ్ఎం లలిత, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గణిత అవధాని అరుణ శివప్రసాద్, సిబ్బంది ఈ అవార్డును అందుకున్నారు. మాస పత్రిక దాత ధరణి ప్రసాద్ మాట్లాడుతూ మాస పత్రికకు అవసరమయ్యే ఖర్చును తనే భరిస్తా అని తెలిపారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలో 35 సంచికలను విడుదల చేసిన సందర్భంగా యూఎస్ఏ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిప్యూటీ రిజిస్ట్రార్‌గా వెంకటరమణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా కోఆపరేటివ్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ రిజిస్ట్రార్‌గా వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా కలెక్టర్ ఆదేశాలతో ఈయన సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.